విద్యార్థికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న రంగారెడ్డి

అంతర్జాతీయ పోటీలకు విద్యార్థి ఎంపిక

పెబ్బేరు, డిసెంబర్ 4 : అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీలకు పెబ్బేరులోని మాస్టర్ మైండ్ పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు కరస్పాండెంట్ లావణ్య, డైరెక్టర్ రంగారెడ్డి సోమవారం తెలిపారు. పదో తరగతి చదువుతున్న డి.లోకేశ్ నేపాల్ రాజధాని ఖాట్మండులో ఈ నెల 7 నుంచి నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎంపికైన ధ్రువీకరణ పత్రాన్ని డైరెక్టర్ రంగారెడ్డి విద్యార్థికి అందజేశారు.

పట్టణ ఓటర్లకు ధన్యవాదాలు

నారాయణపేట, డిసెంబర్ 4 : అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి పేట మున్సిపాలిటీ పరిధిలో దాదాపు అన్ని వార్డుల్లో కలిపి 3వేలకు పైగా మెజార్టీ ఇచ్చినందుకు గానూ పేట పట్టణ ఓటర్లు, ప్రజలకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రకాంత్, పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్పర్సన్ స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓడిపోయినంత మాత్రానా పార్టీ కార్యకర్తలు దిగులు పడాల్సిన అవసరం లేదన్నారు. అధికార పార్టీ చేసే అభివృద్ధి పనులకు సహకరించడంతో పాటు ప్రభుత్వం చేసే తప్పులను ప్రశ్నిస్తూ ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ప్రజలకు సేవ చేస్తూ, ప్రజల్లోనే ఉంటామని తెలిపారు.

ఓటమితో కుంగిపోవద్దు

ధన్వాడ, డిసెంబర్ 4 : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కార్యకర్తలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, గెలుపోటములు సమానంగా స్వీకరించాలని మాజీ ఎంపీటీసీ గౌని శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని ఎంనోనిపల్లీ గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నారాయణపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన రాజేందర్‌రెడ్డిని ఎన్నికల్లో ఓడించడం బాధగా ఉన్న రాజకీయ క్షేత్రంలో ఇలాంటివి సహజం అని అన్నారు. కార్యకర్తలు మనోధైర్యంతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ భారతీ, నాయకులు సచిన్ పాల్గొన్నారు.

సులువుగా అర్థమయ్యేలా బోధించాలి

పెబ్బేరు, డిసెంబర్ 4 : ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు సులువుగా అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాల బోధన చేయాలని రంగాపురం స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జయరాములు అన్నారు. మండలంలోని రంగాపురం ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఉపాధ్యాయుల ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయులతో మాడల్ లెసన్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ, సత్యనారాయణ, మోహన్, రాజు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

పెబ్బేరు, డిసెంబర్ 4 : పెబ్బేరులోని ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ద్వాదశ మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల గుండా నిర్వహించిన అయ్యప్ప భక్తుల శోభాయాత్ర ఆకట్టుకున్నది. భక్తి పాటలకు నృత్యాలు చేస్తూ అయ్యప్ప స్వాములు ఒకరిపై ఒకరు రంగులు జల్లుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామికి అష్టాభిషేకాలు, గణపతి హోమం, బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కృష్ణానదిలో అభిషేకాలు, మణికంఠునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పెద్ద ఎత్తున పట్టణవాసులు పాల్గొనగా మహాపడి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి వ్యవస్థాపకుడు రాజ్‌దేశ్ పాండే, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వాములకు అన్నప్రసాద వితరణ

నారాయణపేట టౌన్, డిసెంబర్ 4 : కార్తీక మాసం సోమవారం పురస్కరించుకొని పట్టణంలోని యాద్గీర్ రోడ్డులో ఉన్న అయ్యప్ప దేవాలయంలో భక్తుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అయ్యప్పమాల దారులకు అన్నప్రసాద వితరణ చేశారు. అంతకుముందు ఆలయంలో స్వామి వారికి చందన, కుంకుమ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు ఉమాపతి, సురేందర్, రాము, బాల్ రాజ్, వెంకటప్ప, శ్రీధర్, మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం

ఆత్మకూరు, డిసెంబర్ 4 : పట్టణంలోని ఎం.వీ. రామన్ అధినేత, మాజీ ఎంపీపీ మొగిళి శ్రీధర్‌గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. పాఠశాల క్రీడాప్రాంగణంలో రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, డ్రైవర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ కోటేశ్వర్, పీఏసీఎస్ అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, అయ్యప్పసేవా సమితి ప్రతినిధులు, సేవా పురస్కార అవార్డు గ్రహీత గాడి లక్ష్మినారాయణ తదితరులు పాల్గొని శ్రీధర్‌గౌడ్‌ను పూలమాల, శాలువాలతో సత్కరించారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆన్సీశ్రీధర్, విద్యా సంస్థ సలహాదారుడు రాములు, వైస్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మొగిళ శ్రీధర్‌గౌడ్, ఎంపీపీ బంగారు శ్రీనివాసులు

నేడు మక్తల్‌లో కంటి వైద్య శిబిరం

మక్తల్, డిసెంబర్ 4 : పట్టణంలోని లయన్స్ క్లబ్ సేవాభవన్‌లో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ మక్తల్ బీమా ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిభిరం నిర్వహిస్తున్నట్లు ఆక్లబ్ అధ్యక్షుడు అంబాదాస్‌రావు ,డిస్ట్రిక్ విజన్ చైర్మన్ అనుగొండ శ్రీనివాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కంటి వైద్య నిపుణులతో వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు. అర్హులైన వారికి మహబూబ్‌నగర్ జిల్లా ఏనుగొండలోని రాంరెడ్డి కంటి దవాఖానలో ఆపరేషన్ చేయిస్తామన్నారు. కంటి పరీక్షలకు వచ్చే వారు 50ఏండ్లు పైబడిన వారు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, లేదా ఓటర్ ఐడీ కార్డులను వెంట తీసుకరావాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు విద్యార్థుల ఎంపిక

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో సలాంబిన్

మక్తల్ టౌన్, డిసెంబర్ 4 : రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు మక్తల్ విద్యార్థులు ఎంపికయ్యారని డ్రాగన్ చోటా ఖాన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శాలంబిని ఉమర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో మక్తల్ డ్రాగన్ చోట కాన్ స్పోర్ట్స్ విద్యార్థులు క్రీడల్లో పాల్గొని రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఎంపికయ్యారన్నారు. మక్తల్ పట్టణానికి చెందిన అంజన్ తేజ, వాకిటి ధరణి, కీర్తితోపాటు నారాయణపేటకు చెందిన అక్షర మహబూబ్‌నగర్‌కు చెందిన సాయిగణేశ్ ఎంపికయ్యారన్నారు. ఈనెల 5వ తేదీన వరంగల్‌లో క్రీడలు నిర్వహిస్తారని, నారాయణపేట జిల్లా విద్యార్థులు క్రీడల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో రాణించే విధంగా విద్యార్థులను తయారు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను డ్రాగన్ చోటా ఖాన్ సభ్యులు అమ్రేశ్ అంజన్ ప్రసాద్, ఎండీ సలీంలు సన్మానించినట్లు తెలిపారు

కళాకారులకు స్ఫూర్తి ఘంటసాల

నారాయణపేట టౌన్, డిసెంబర్ 4 : నేటి కళాకారులకు స్ఫూర్తి ఘంటసాల వెంకటేశ్వరరావు అని టీవీ, రేడియో గాయకుడు నర్సిములు అన్నారు. పట్టణంలోని బాలకేంద్రంలో ఎస్పీ బాలు అభిమాన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘంటసాల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘం టసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన గాన మాధుర్యంతో భక్తి, సినీ గీతాలతో పాటు భగవద్గీతలోని శ్లోకాలను సామాన్య మానవులకు అర్థమయ్యే రీతిలో ఆలపించి తెలుగోడి ఘన కీర్తిని దశ దిశలా చాటిన మహోన్నత వ్యక్తి ఘంటసాల అని తెలిపారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలు ఫ్యాన్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, తబల వాయిద్యాకారులు రామకృష్ణ, నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయురాలు రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

మాగనూరు, డిసెంబర్ 4 : మండలకేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఈఆర్‌పీ తిరుపతి దివ్యాంగులకు తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలు ఉన్న దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం చాలా సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. తల్లిదండ్రులు దివ్యాంగులు తమ పనులు తామే చేసుకొనేటట్లు వ్యవహరించాలని సూచించారు. దివ్యాంగులు స్నానం చేయకపోవడం, బట్టలు వేసుకోకపోవడం, తల దువ్వు కోకపోవడం, తినకపోవడం లాంటి పనులు చేస్తుంటారని విద్యార్థులు తల్లిదండ్రులు వారి పనులు వారే చేసుకునేటట్లు వారిని ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం దివ్యాంగులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాజ్. సీఆర్పీ అల్లా గౌడ్, ఆపరేటర్ స్వప్న, ఉపాధ్యాయులు స్వప్న, విశాలాక్షి శశిరేఖ విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

మాగనూరు, డిసెంబర్ 4: మండలంలోని వడ్వాట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో మహ్మద్ అబ్దుల్ ఘని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎక్కువగా ఉండటం, ఉపాధ్యాయులు తక్కువగా ఉండడంతో చాలా ఇబ్బందిగా ఉందని ప్రసన్నలక్ష్మి డీఈవోకి వివరించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు రాబోయే పరీక్షలకు సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టాలని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని అనవసరమైన సెలవులు తీసుకోరాదని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబలైజింగ్ ఆఫీసర్ రాజేందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు రైతులతో సమావేశం

నారాయణపేట రూరల్, డిసెంబర్ 4 : మండలంలోని జాజాపూర్ గ్రామంలోని రైతు వేదికలో మృతిక దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 8:30గంటలకు రైతులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏఈవో ప్రశాంతి తెలిపారు. క్లస్టర్ పరిధిలోని రైతులందరూ ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ విజయోత్సవ సంబురాల్లో అపశృతి

- గుండెపోటుతో కార్యకర్త మృతి

రషీద్ (ఫైల్)

ఊట్కూర్, డిసెంబర్ 4 : అసెంబ్లీ ఎన్నికల విజయోత్సవ సంబురాల్లో గుండెపోటుతో కాంగ్రెస్ కార్యకర్త మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం ఊట్కూరు మండలకేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. మక్తల్ ఎమ్మెల్యేగా వాకిటి శ్రీహరి విజయం సాధించడంతో ఊట్కూరులో విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీజే పాటలకు డ్యాన్స్ చేస్తున్న కాంగ్రెస్ నేత పొర్ల రషీద్ (34) ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన కార్యకర్తలు చికిత్స నిమిత్తం నారాయణపేట జిల్లా దవాఖానకు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పార్టీ నాయకులు పరామర్శించారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

జాజాపూర్‌లో 'ఇంటింటి ధ్యానం'

నారాయణపేటరూరల్, డిసెంబర్ 4 : మండలంలోని జాజాపూర్ గ్రామంలోని ధ్యానమండలి ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా ఇంటింటి ధ్యానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఒక ధ్యాన మండలి సభ్యురాలు తమ ఇంట్లో ధ్యానం చేయిస్తున్నారు. సోమవారం సువర్ణ ఇంట్లో ధ్యానం నిర్వహించగా ధ్యాన మండలి సభ్యులందరికీ శాలువాలతో సన్మానించారు.

మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్

మక్తల్ టౌన్, డిసెంబర్ 4 : తెలంగాణ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నారాయణపేట సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఉదయం మస్తాన్‌లోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ జూనియర్ కాలేజీలను ఆయన తనిఖీ చేసి పాఠశాలలో ఆహార పదార్థాలు, పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార ధాన్యాలు నిల్వచేసే స్థలం, తాగునీరు శుభ్రంగా ఉండాలని, సీసీటీవీలను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు భవిష్యత్‌లో చక్కటి విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు తప్పవని ప్రిన్సిపాల్‌కు హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాది దత్తాత్రేయ ఉన్నారు.

వాతావరణంలో మార్పులు

- ఆందోళనలో రైతన్నలు

పెద్దమందడి, డిసెంబర్ 4 : బంగాళఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ తీవ్రరూపం దాల్చడంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. రెండు రోజుల నుంచి మేఘాలు కమ్ముకోగా వాతా వరణమంతా చల్లగా మారిపోయింది. మండలకేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మిచౌంగ్ తుఫాన్ కారణంగా చిరుజల్లులు కురవడంతో కొత దశలో ఉన్న పంటలు తడిసిపోయాయి. అదేవిధంగా పంట చేతికి వచ్చి కల్లాలు, ధాన్యం కేంద్రాల్లో అరబెట్టుకున్న ధాన్యం తడిసిపోతుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో అరబెట్టిన ధాన్యాన్ని కుప్ప గట్టి టార్పాలిన్ కవర్లతో కప్పి ఉం చారు. కోత దశలో ఉన్న పంటలు కోసేందుకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

అమరచింత, డిసెంబర్ 4 : చెరుకులోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో స్తంభం విరిగిపోయిన ఘటన మండలకేంద్రంలో ఆదివారం అర్థరాత్రి చోటుచేసుకున్నది. విద్యుత్‌శాఖ, మున్సిపల్ అధికారులు కథనం ప్రకారం మస్తీపూర్ గ్రామానికి చెందిన రైతు నర్సింహ తన పంట చెరుకును ట్రాక్టర్‌లో లోడ్ చేసి తీసుకెళ్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యంగా కారణంగా రోడ్డు పక్కన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాగా అమరచింత చివరిలో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌కు అక్కడి నుంచే విద్యుత్ సరఫరా అవుతుండంతో పట్టణంలోని ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమి కాకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కృష్ణ, డిసెంబర్ 4 : చెట్టుకు ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గుడెబల్లూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. గ్రామస్తులు కథనం ప్రకారం గ్రామానికి చెందిన గిర్క చంద్రశేఖర్‌గౌడ్ (25) కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా వ్యవసాయ పొలం వద్ద ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. గతంలో పెద్దకొడుకు కరెంట్ షాక్‌కు గురై మృతిచెందగా ఇప్పుడు రెండో కొడుకు ఆత్మహత్యకు పాల్పడండంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.